# కొసమాల...'వ్యాసగీత' వరమాల

ఏ తరగతిని పరీక్షించినా 70 శాతం పైబడి సమాధానాలు చెప్పగలిగే పిల్లలను మీరు ఏ పాఠశాలలోనైనా గమనించారా! అయితే ఒక్కసారి శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం కొసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి రండి.. ఆ 'వ్యాస గీత' బృందం సరస్వతిని నిరంతరం ఆవాహన చేసుకుంటున్న తీరును చూసి మురిసిపోయి అభినందించి తీరుతారు..

నిజం మిత్రులారా!

33 సంవత్సరాలు మానిటరింగ్ ఆఫీసర్ గా ఉమ్మడి రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో, శ్రీకాకుళం జిల్లా లోని 90 శాతం పాఠశాలల్లో అనేక తరగతులను చూసి ఉన్నాను. ప్రతి తరగతిలో ముందు వరుసలోనో, అక్కడక్కడ ఓ 10 శాతం వరకు సమాధానం చెప్పే పిల్లల పర్ఫార్మెన్స్ తో సంతృప్తి చెందుతూ, ఉన్నతాధికారులకు ప్రదర్శించేస్తూ 'హమ్మయ్య ' అని ఊపిరి పీల్చేసుకుంటున్నాం.

ఈ 'వ్యాస గీతం' అట్లా కాదే, ఆరవ తరగతికి ఇంగ్లీషులో మీకు తెలిసిన పదాలు ఎవరు ఎక్కువ రాస్తారో వారికి గిఫ్ట్స్ ఇస్తానంటే.. నిత్య 234, మోక్షిత 210, ప్రత్యూష 183, సందీప్ 166 ఇలా 100 కంటే ఎక్కువ పదాలు రాసిన వారే ఎక్కువ. ఒక తరగతిలో నలుగురైదుగురు 50 పదాలు దాటితే సంతోష పడిపోతున్న అనుభవంతో వెళ్లిన నాకు ఆ తరగతి నుండి బయటకు రావడమే కష్టమైంది.

అలాంటి తీయని అనుభవమే ఎనిమిదవ తరగతిలో ఫిజిక్స్ క్లాసులో కంభషన్ గురించి ఎంతో నెమ్మదిగా, వివరంగా బోధిస్తున్న రాజశేఖర్ మాస్టారు.. పిల్లల శ్రద్ధా పూర్వక ప్రతిస్పందన..

ఏంటమ్మా, నీ విజయ రహస్యం.. అంటే అడ్మిషన్ అయిన మొదటి తరగతిలోనే 'అభ్యసన పరుగులో అలిసిపోతున్న' (వెనుకబాటు అనకూడదు సుమా, సమాజ వైఫల్యాలకు పిల్లలను బలిచేయడం, ముద్రలు వేయడం ఎంతవరకు సమంజసం?) పిల్లలకు మొదటి మూడు నెలలు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ద్వారా మరో నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలు ప్రశాంతంగా గడపగలిగే 'వ్యూహం' అమలుపరుస్తున్న 'నాయకత్వ నిపుణత' వినిపించింది, కనిపించింది





ఒక పాప పురోగతి అనుభవం వింటుంటే రాష్ట్ర మొత్తం ఇలా చేస్తే 100% నమోదు, హాజరులే కాక 100 శాతం నాణ్యత గల 'విద్యల స్వర్ణాంధ్ర' సాధన అత్యంత సులభంగా జరుగుతుందనిపించింది.





అక్కడ 'న్యూట్రి గార్డెన్' ఉంది, కూరగాయలు దండిగనే పండుతాయి. అక్కడ పిల్లల సదుపాయాల కోసం ఉపాధ్యాయ బృంద తపనకు, గ్రామస్తుల సహకారం కూడా చాలా ఎక్కువ. వ్యాస గీత ఆలోచనల వల్ల పాతవన్నీ కొత్తగా మారిపోతాయి. డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయమ్మా అంటే పర్వాలేదు సార్, నా పిల్లలే కదా, అన్న మాటలు వింటే కళ్ళు చెమర్చకుండా ఉంటాయా!

ఈనాడు రిపోర్టర్ గారు న్యూస్ రిపోర్టింగ్ కోసం ఫోన్లో అడిగినప్పుడు కొసమాల గూర్చి మాట్లాడుతూ ఉంటే "మా అమ్మాయిని పక్కనే ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను కాదనుకొని మండల కేంద్రం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇదే పాఠశాలకు రోజూ తీసుకు వెళ్తున్నాను సార్" అనడంతోనే ఈ పాఠశాల నాణ్యత ఎంతగా వ్యాపించిందో అర్థమయిపోయింది. నాణ్యత ఉంటే తల్లిదండ్రులకు దూరాభారాలు, అవరోధాలు ఏం ఉండవని, ఎంతో కృతజ్ఞత చూపుతారని మరోసారి రుజువైంది.

ఎంతమంది పిల్లలకు బహుమతులు ఇవ్వగలను? ఏ మాస్టారిని ప్రత్యేకంగా అభినందించగలను?

అందుకే 'గీత బృందావనానికి' ఈ చిన్ని అక్షరమాల.

మీ

తిరుమల చైతన్య,

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకాకుళం.